క్లుప్తంగా

పరీక్ష కేంద్రం వద్ద పటిష్ట భద్రత



సూచనలు ఇస్తున్న తిరుపతి అడిషనల్ ఎస్పీ విమలాకుమారి

పుత్తూరు రూరల్: పట్టణంలోని శ్రీవెంకట పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించనున్న పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్ష కేంద్ర వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లపై తిరుపతి అడిషనల్ ఎస్పీ విమలకుమారి పలు సూచనలు చేశారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో పోలీసు అధికారులు, ఇతర సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరీక్షా కేంద్ర పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పుత్తూరు ఇన్‌చార్జ్ డీఎస్పీ రామరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మిరప సాగుపై అవగాహన

నింద్ర: మండలంలోని అగరంపేట గ్రామంలోని రైతులకు మిరప సాగులో అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. తిరుపతిలోని కృషి విజ్ఞాన కేంద్రం వారిచే రైతులకు అవగాహన కల్పించారు. విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు సాగు చేసే మిరపలో జాగ్రత్తలు పాటించడం వల్ల ఆశించిన దిగుబడులు సాధించవచ్చన్నారు. భూసారంలో లోపాలు లేకుండా పంటకు కావలసిన పొటాష్, బోరాన్ వంటి మందులను వేయాలన్నారు. ఈ సందర్భంగా మిరప సాగు చేసిన పంటలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయండి

నింద్ర: మండలంలోని నింద్ర గ్రామంలో నిర్మాణంలో ఉన్న జగనన్న గృహనిర్మాణ పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ వేణు అన్నారు. శనివారం ఆయన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తి చేయాలని అన్నారు. ఆయనతో పాటు హౌసింగ్ ఏఈ శ్రీధర్ రాజు, సర్పంచ్ బాబురెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పొలంలోకి దూసుకెళ్లిన పాల లారీ



ఇంటి ప్రహరీని ఢీకొన్న పాల లారీ

శ్రీరంగరాజపురం: పాల లారీ పొలంలోకి దూసుకెళ్లి ఇద్దరికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని చిన్నతయ్యూరు వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం వివరాలిలా.. చిత్తూరులోని ఆరోగ్య పాల డెయిరీకి లోడుతో లారీ వెళ్తుండగా డ్రైవర్ నిద్రలోకి జారుకోవడంతో అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. అక్కడ ప్రహరీని ఢీకొట్టడంతో లారీ క్లీనర్‌తో సహా డ్రైవర్ రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని లారీ నుంచి బయటకు తీసి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అంటువ్యాధులపై అవగాహన

పాలసముద్రం: అంటువ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం ఆయన ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండడం వల్ల దోమల వ్యాప్తి పెరిగి, మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, బోదకాలు, మెదడు వాపు వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల పాల్గొన్నారు.

అన్ని వర్గాల ప్రజలకు పథకాలు

- వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించండి
- గడప గడప కార్యక్రమంలో మంత్రి ఆర్‌కే రోజా



లబ్ధిదారులకు సంక్షేమ బుక్‌లెట్ అందిస్తున్న మంత్రి రోజా

పుత్తూరు రూరల్: కుల, మత, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల వారికి సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసులు, క్రీడాశాఖల మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. శనివారం సాయంత్రం ఆమె పుత్తూరు రూరల్ మండలం వేపగుంట సచివాలయ పరిధిలోని వేపగుంట, ఏఏడబ్ల్యూ, బీసీ కాలనీ గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటి వద్దకు వెళ్లి మూడున్నరేళ్లుగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. ఎన్నికల సందర్భంగా విడుదల చేసిన మ్యానిఫెస్టోలోని హామీలను 98 శాతం నెరవేర్చినట్లు చెప్పారు. నేడు అవినీతికి తావులేకుండా వలంటీర్ల ద్వారా ప్రభుత్వ పథకాలు ఇంటి గుమ్మం వద్దకే వస్తున్నాయని చెప్పారు. అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నేటి ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు. పిల్లలకు తల్లిదండ్రులు అందించేది చదువేనని, దాన్ని జగనన్న బాధ్యతగా తీసుకుని అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, సంపూర్ణ పోషణ వంటి పథకాలను అందిస్తున్నారని వివరించారు.

అవ్వా పెన్షన్ అందిందా..!

కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మధ్యకు వెళ్లిన మంత్రి ఈ సందర్భంగా అక్కడే ఉన్న ఓ అవ్వను పలకరించారు. అవ్వా పెన్షన్ అందిందా? అక్కా చేయూత అందిందా? ఆసరా అందుకున్నారా ? అంటూ ఆరా తీశారు. అన్నీ అందుతున్నాయని లబ్ధిదారులు సమాధానం చెప్పారు. ఇన్ని పథకాలు అందిస్తున్న జగనన్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని మంత్రి అభ్యర్థించారు. దీనిపై పలువురు మహిళలు స్పందిస్తూ మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉంటామంటూ స్పష్టం చేశారు. స్థానికంగా గుర్తించిన చిన్న చిన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ మునివేలు, గ్రామ సర్పంచ్ గిరిజాప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మణమూర్తి, సుదర్శనం, నరసింహులు, అఖిల్, రాజయ్య, జయకుమార్, మోహన్‌గాంధీ, రవినాయుడు, హేమ, పరంధామయ్య, బాబు, మనోహర్, బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి జన నీరాజనం



లబ్ధిదారులతో సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకుంటున్న మంత్రి నారాయణస్వామి

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పెనుమూరు(కార్వేటినగరం) : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన ప్రజలు తమకు నీరాజనాలు పలుకుతున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి అన్నారు. శనివారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని చార్వకాల్వ సచివాలయ పరిధిలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని, సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశం మొత్తం ఆంధ్రరాష్ట్రం వైపు చూస్తోందంటే తమ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధే కారణమన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారు ఆదెమ్మ(80) మాట్లాడుతూ తన ఆయుష్షు కూడా పోసుకుని జీవితాంతం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండాలని ఆకాంక్షించారు. అలాగే అదే గ్రామానికి చెందిన కురవృద్ధుడు గోవిందరెడ్డి(85)తో మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నీకు తెలుసా అని అడగ్గా..వృద్ధుడు స్పందిస్తూ నా మనవడు జగన్‌మోహన్‌రెడ్డిని పెనుమూరులో పాదయాత్రగా వచ్చినప్పుడు కలిశానని, తాను కూడా పాదయాత్ర చేశానన్నాడు. ఆయన ఇస్తున్న పింఛన్, బియ్యంతో జీవనం సాగిస్తున్నానని చెప్పాడు. దీంతో మంత్రి వారికి పాదాభివందనం చేశారు. గ్రామానికి చెందిన గీతా అనే మహిళ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేయాలని కోరగా స్పందించిన మంత్రి వెంటనే సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ మోసం చేస్తే..మేం బిల్లులు ఇచ్చాం..

అనంతరం మంత్రి మాట్లాడుతూ పెనుమూరు మండలానికి గతంలో టీడీపీ ప్రభుత్వం 472 ఇళ్లు మంజూరు చేసి వారి ఖాతాల్లో ఒక్క రూపాయి మాత్రమే జమ చేసి మోసం చేసిందన్నారు. నేడు జగనన్న వారందరికీ బిల్లులు మంజూరు చేశారని, ఓట్లు వేయని వారికి కూడా ఇల్లు మంజూరు చేసిన ఘనత ఒక్క జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బండి కమాలకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దూది మోహన్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, సర్పంచ్‌లు మురళి, నవీన్‌కుమార్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, యుగంధర్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, రాజారెడ్డి, మురళి, రామచంద్రారెడ్డి, ఎంపీడీఓ శివయ్య, తహసీల్దార్ విజయకుమార్ పలువురు పాల్గొన్నారు.

జిల్లాస్థాయిలో విద్యార్థిని ప్రతిమ ప్రతిభ



మున్సిపల్ కమిషనర్ నుంచి షీల్డు, ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రతిమ

నగరి: భారతీయ సంస్కృతిపై శ్రీ సత్యసాయి సేవాసదన్ వారు సత్యసాయి 95వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జూనియర్ కళాశాల, ఆంగ్ల మాధ్యమం విభాగంలో నగరి పట్టణం సూర్య జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని కేసీ ప్రతిమ (16) జిల్లాస్థాయిలో మొదటి స్థానం సాధించింది. 4వేల మంది విద్యార్థులు ఈ పోటీలకు హాజరుకాగా, డిగ్రీ, జూనియర్, పాఠశాల స్థాయిలో ఆంగ్ల, తెలుగు మాధ్యమాల్లో 36 మందిని ఎంపిక చేశారు. వీరిలో జూనియర్ కళాశాల, ఆంగ్ల మాధ్యమం విభాగంలో కేసీ ప్రతిమ జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం, సురేఖ ద్వితీయ స్థానం సాధించారు. విద్యార్థులను శనివారం స్థానిక బాలాజీ గోల్డెన్ సిటీలో నగరి సత్యసాయి సేవా సమితి వారు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నగరి మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి అతిథిగా హాజరై విజేతలకు షీల్డు, ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా సత్యసాయి సదన్ అధ్యక్షుడు మధు, జిల్లా కన్వీనర్ శేష నారాయణ, నగరి కన్వీనర్ మురళీధర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వెదురుకుప్పం: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ గారంపల్లె గ్రామ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. శనివారం సాయంత్రం అటుగా వెళ్తున్న కాపరులకు కుళ్లిన వాసన రావడంతో అనుమానం వచ్చి పరిశీలించారు. ముళ్లకంపల్లో అనుమానాస్పదస్థితిలో గుర్తు తెలియని శవాన్ని గుర్తించారు. మూడు రోజుల కిందటే వ్యక్తి మృతి చెంది ఉంటాడని చెబుతున్నారు. గుర్తించలేని స్థితిలో శవం ఉంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


దుమ్ములేపిన కోడెగిత్తలు



ఎద్లను నిలువరించి పలకలు పట్టేందుకు యువత పోటీలు పడ్డారు.

వెదురుకుప్పం: మండలంలోని మాంబేడు పంచాయతీ సింగపూర్‌ఇండ్లు గ్రామంలో శనివారం జరిగిన జల్లికట్టులో కోడెగిత్తలు దుమ్ము రేపాయి. సంక్రాంతి సంబరాల్లో భాగంగా గ్రామంలో నిర్వహించిన ఈ పందేల్లో పశువులు హోరెత్తించాయి. ముందుగా ఎద్లకు పలకలు, వస్త్రాలు, బెలూన్లు కట్టి పందేనికి సన్నద్ధం చేశారు. అప్పటికే వివిధ ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో అక్కడికి చేరుకున్న యువత అల్లి వద్ద పలకల కోసం పోటీ పడ్డారు.

ప్రభుత్వ డాక్టర్ నవీన్ మృతి



నవీన్‌విక్రమ్ (ఫైల్)

పుత్తూరు రూరల్: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో అనస్థీషియా డాక్టర్‌గా పనిచేస్తున్న డాక్టర్ జి.నవీన్‌విక్రమ్(46) శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చెన్నైలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం చనిపోయాడు. అతని స్వగ్రామం పుత్తూరుకు మృతదేహాన్ని తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న మంత్రి ఆర్కే రోజా సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి శనివారం పుత్తూరులో నవీన్ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్ డి.జయప్రకాష్, ఎంఎల్‌ఓ దిలీప్‌మొదలి, ఈశ్వరాలయం కమిటీ చైర్మన్ కె.రమేష్‌బాబు, ప్రభుత్వ ఆస్పత్రి డెవలప్‌మెంట్ మెంబర్ నారాయణస్వామి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి

ఆరిమాను గంగమ్మకు పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు ఆయకట్టు ఆరిమాకులపల్లిలో వెలసిన శ్రీఆరిమాను గంగమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వెంకటాచలపతి అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని పట్టువస్త్ర సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో సుందరంగా అలంకరించారు. కార్యక్రమంలో ఈఓ తిమ్మారెడ్డి, ఆలయ చైర్మన్ లింగారెడ్డి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించండి



అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ రాజేశ్వరరావు



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఇస్మాయిల్ ఖాన్, గాయత్రి

గంగాధరనెల్లూరు: వాహన చోదకులు ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వరరావు కోరారు. స్థానిక బస్టాండ్ కూడలిలో శనివారం 34వ జాతీయ రహదారిభద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహన చోదకులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహన చోదకులు తప్పనిసరిగా లైసెన్స్‌లు ఉండాలన్నారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు శివకుమార్, ఇస్మాయిల్, ఏఎస్‌ఐలు ఆంజనేయులురెడ్డి, మనోహర్ పాల్గొన్నారు.

కార్వేటినగరం: వాహన చోదకులు రోడ్డు భద్రత నియమాలను తప్పక పాటించాలని ఎస్‌ఐ దస్తగిరి అన్నారు. 34వ జాతీయ రహదారి వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక గాండ్లమిట్ట కూడలిలో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు అవగాహన కల్పించారు.

హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ

నగరి : హెల్మెట్ ధారణతో ప్రాణాలకు రక్షణ అని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు ఎండీ ఇస్మాయిల్ ఖాన్, గాయత్రి అన్నారు. శనివారం 34వ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా నగరి పట్టణంలో రహదారి భద్రత జీవితానికి రక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆటోస్టాండు వద్ద డ్రైవర్లతో సమావేశమైన వారు డ్రైవర్లంతా తప్పనిసరిగా లైసెన్సు కలిగి ఉండాలన్నారు. వాహనాలకు సంబంధిత రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలన్నారు. వాహన పరిమితికి మించి ప్యాసింజర్లను వాహనాల్లో ఎక్కించరాదన్నారు. వాహనాన్ని రోడ్డుపై అకస్మాత్తుగా ఆపరాదని, రోడ్డు పక్కకు వెళ్లి ఆపాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి మారుతినందన్



మారుతీనందన్‌ను అభినందిస్తున్న జిల్లా డీసీఈబీ కార్యదర్శి హేమారెడ్డి

కార్వేటినగరం: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల పరిధిలోని కత్తెరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి మారుతీనందన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం, జిల్లా డీసీఈబీ కార్యదర్శి హేమారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా శనివారం స్కూల్‌లో విద్యార్థిని అభినందించారు. అనంతరం జిల్లా డీసీఈబీ చైర్మన్ మాట్లాడుతూ 23న విజయనగరంలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో తమ విద్యార్థి పాల్గొంటాడని చెప్పారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఆటల పోటీల్లో తర్ఫీదు ఇస్తున్న పీఈటీ మురళీరాజును అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి: మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు నగరి దళితవాడ (ఓసీ మహిళ) పోస్టు ఖాళీగా ఉందన్నారు. 10వ తరగతి, ఆపై విద్యార్హత కలిగి, వయస్సు 18 నుంచి 35లోపు ఉన్నవారు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 30న ఇంటర్వ్యూ నిర్వహిస్తామన్నారు.

స్పందన ఫిర్యాదులపై దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి, తహసీల్దార్ బాబు

పాలసముద్రం: గ్రామ సచివాలయంలో స్పందన కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఎంపీడీఓ విద్యావతి, తహసీల్దార్ బాబు తెలిపారు. శనివారం వారు వెంగళరాజుకుప్పం గ్రామ సచివాలయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా వలంటీర్లు పని చేయాలని తెలిపారు. సచివాలయానికి సమస్యలతో వచ్చిన ప్రజలు, రైతులతో స్నేహభావంతో మెలిగి అర్జీలను తీసుకోవాలన్నారు. గ్రామాల్లో తాగునీరు, వీధిలైట్లు, తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ వంటివి బాధ్యతగా నిర్వర్తించాలన్నారు. తహసీల్దార్ బాబు మాట్లాడుతూ స్పందనలో వచ్చిన అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం ద్వారా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరిస్తారని తెలిపారు. సోమవారం గడప గడపకు కార్యక్రమం జరుగుతుందని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సుధ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతగా పని చేయండి



సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు

పాలసముద్రం: మండల పరిధిలో అధికారులు, సచివాలయ ఉద్యోగులు బాధ్యతగా పని చేయాలని ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎల్‌డీఓ చిన్నరెడ్డెప్ప, సూపరింటెండెంట్ ఆదిశేసు తెలిపారు. శనివారం వారు కృష్ణజమ్మపురం, ఆముదాల, శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం గ్రామ సచివాలయం, బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎంపీడీఓ కార్యాలయం, పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు సకాలంలో కార్యాలయాలకు వస్తున్నారా ? లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అన్ని కార్యాలయాల్లో మూమెంట్ రిజిస్టర్, హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ముఖ్యంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారా ? లేదా ? అని స్థానికులను అడిగి తెలుసుకున్నారు.

సమయపాలన పాటించాలి

వెదురుకుప్పం: ప్రతిఒక్కరూ సమయ పాలన పాటించాలని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ రవికుమార్ అన్నారు. శనివారం మండలంలోని కార్యాలయాలు, సచివాలయాలను ముగ్గురు అధికారులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ సందర్శించారు. ఈసందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది సమయానికి విధులకు వస్తున్నారా ? లేదా ? జాబ్ చార్ట్ ప్రకారం విధుల నిర్వహణ వంటి అంశాలను పరిశీలించారు. అనంతరం అడిషనల్ పీడీ మాట్లాడుతూ విధుల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని చెప్పారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు.

అభివృద్ధి పనుల పరిశీలన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కేఎల్‌ఎన్ రెడ్డి

పుత్తూరు రూరల్: పట్టణంలోని హరిశ్చంద్ర శ్మశాన వాటికలో జరుగుతున్న రోడ్డు, కల్వర్టు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ కేఎల్‌ఎస్ రెడ్డి పరిశీలించారు. నందిమంగళం, చెర్లోపల్లి లేఅవుట్లలో జరుగుతున్న జగనన్న ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. నిర్మాణ పనులు వేగవంతం చేయాలని లబ్ధిదారులను ఆదేశించారు. తాయిమాంబాపురం శ్మశాన వాటికలో రోడ్డు నిర్మాణ పనులు, ముళ్ల పొదల తొలగింపు పనులను పర్యవేక్షించారు.

అభివృద్ధిలో మరో ముందడుగు

- నగరి సహకార సంఘానికి పలు అవార్డులు
- నేడు మంత్రి రోజా చేతుల మీదుగా పెట్రోల్‌బంక్ ప్రారంభం



నూతనంగా నిర్మించిన పెట్రోలు బంకు

నగరి: నగరి సహకారా బ్యాంకు ఆధ్వర్యంలో ఏర్పాటైన తొలి పెట్రోలు బంకు ఆదివారం ప్రారంభం కానుంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా నగరిలో ప్రారంభించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 36 సొసైటీలు ఉండగా, వాటిలో 13 సొసైటీలకు పెట్రోల్ బంకులు మంజూరయ్యాయి. నగరి పీఏసీఎస్ అధికారులు పెట్రోల్ బంకు నిర్మాణం పూర్తిచేసి జిల్లాలో ప్రథమంగా ప్రారంభించనున్నారు. రొంపిచెర్ల, బియ్యప్పగారి పల్లె పీఏసీఎస్‌లు పెట్రోల్ బంకు నిర్మాణాన్ని 50 శాతానికి పైగా పూర్తిచేశాయి. మిగిలిన ప్రాంతాల్లో భూసంబంధిత సమస్యలు, ఇతర సమస్యల కారణంగా వివిధ దశల్లో ఉన్నాయి. సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పెట్రోలు బంకుకు హిందూస్థాన్ పెట్రోలియం కంపెనీ వారు మౌలిక సదుపాయాలు సమకూర్చి పెట్రోల్ పంపు సిద్ధం చేశారు. పెట్రోల్, డీజిల్ కొనుగోలు నిమిత్తం నిర్వహణ మూలధనంగా రూ.30 లక్షలను 4 శాతం అతితక్కువ వడ్డీకి నాబార్డు సహకార సంఘాలకు అందించింది.

తొలి పెట్రోలు బంక్ ఇదే..

జిల్లాలో 13 సొసైటీలకు పెట్రోలు బంకులు మంజూరు కాగా నగరి పీఏసీఎస్‌లో తొలి పెట్రోలు బంకు ప్రారంభం కానుంది. పరిమాణంలో ఎలాంటి లోపాలు రాకుండా వినియోగదారులకు పెట్రోలు అందించి నాణ్యతతో పెట్రోలు బంకును నడుపుతాం. ఇప్పటికే జిల్లాలో నగరి పీఏసీఎస్ ప్రథమ స్థానంలో ఉంది. వరుసగా రెండుసార్లు ఎక్స్‌లెన్స్, మెరిట్ అవార్డులు సాధిస్తూ వస్తోంది.

– తులసిపిళ్లై, సీఈఓ, నగరి పీఏసీఎస్

ప్రభుత్వ సహకారంతోనే..

ముఖ్యమంత్రి సహకారంతో పాటు అభివృద్ధి పనుల్లో మంత్రి రోజా ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. కనుకే పీఏసీఎస్ అభివృద్ధి వేగంగా సాగుతోంది. జిల్లాలో నగరి పీఏసీఎస్ మొదటి స్థానంలో నిలిచి నేడు తొలి పెట్రోల్ బంక్ నగరిలో ప్రారంభిస్తున్నామంటే అందుకు వారి సహకారమే కారణం. డీసీసీబీ, నాబార్డు, పీఏసీఎస్ డెవలప్‌మెంట్ సెల్ అధికారులు ప్రోత్సాహం అందించారు.

– తిరుమలరెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, నగరి